## క్లుప్తంగా

### చిన్నారులకు బేబీ కేర్స్ పంపిణీ



బేబీ కేర్స్ అందిస్తున్న పూర్వ విద్యార్థులు

**మండపేట:** స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని 70 మంది చిన్నారుల తల్లులకు ఏడిద రోడ్డులోని వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1977 బ్యాచ్ టెన్త్ విదార్థులు శనివారం బేబీ కేర్స్ వితరణ చేశారు. పూర్వ విద్యార్థులందరూ ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో స్థిర పడ్డారు. వారిలో కొంతమంది పట్టణంలో స్థిర పడడంతో నేటికీ స్నేహబంధాన్ని కొనసాగిస్తూ సమాజ సేవ చేస్తున్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం చెంతన ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌కు పూర్వ విద్యార్థులు చేరుకుని అక్కడ ఉన్న చిన్నారుల తల్లులకు బేబీకేర్స్‌ను ఆసుపత్రి వైద్యురాలి చేతుల మీదుగా అందించారు. పూర్వ విద్యార్థులు కాళ్ల సూర్యప్రకాష్ (బాబు), కొనే వీర్రాజు, సాయి, వల్లూరి దొరకయ్య, పొదలాడ శ్రీను, గాంధీ, బీరక శ్రీను, త్రిమూర్తులు, ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

### పీఠంలో నేడు పౌర్ణమి పూజలు

**రాయవరం:** మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఆదివారం మార్గశిర పౌర్ణమి పూజలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. శనివారం ఆయన పీఠంలో విలేకరులతో మాట్లాడుతూ పౌర్ణమి సందర్భంగా విజయ దుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, విజయ వేంకటేశ్వరస్వామికి తులసి దళార్చనలు, భవానీ సమేత అష్టమ లింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం విజయదుర్గా అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు నిర్వహించనున్నట్టు తెలిపారు.


### వైఎస్సార్ పార్కుకు 23 బెంచీల వితరణ



దాతలను సత్కరిస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు

**మండపేట:** స్థానిక బురుగుంట చెరువు వైఎస్సార్ పార్కుకు పట్టణానికి చెందిన దాతలు, లయన్స్ క్లబ్ సభ్యులు సంయుక్తంగా 23 సిమెంట్ బెంచీలు సమకూర్చారు. డొక్కా సీతమ్మ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కోన సత్యనారాయణ ఆధ్వర్యంలో దాతలు శనివారం వాటిని పార్కుకు అందించారు. గన్నేడ శ్రీనివాస్ ఐదు బెంచీలు అందించారు. రౌతు బంగారయ్య, ఎంవీ రమణరావు, ముత్తారెడ్డి వెంకట్రావు, గనిశెట్టి శ్రీనివాసరావు, కాళ్ల సూర్యప్రకాశరావు, గంపల సత్యప్రసాద్, కోనే వీర్రాజు, అధికారి శ్రీనివాస్, కరుటూరి రామారావు, గొర్రెల రమణ, లంక రవికిరణ్‌లు రెండేసి, ఒక్కొక్కటి వంతున బెంచీలు అందించారు. మరోదాత గుంటూరు సత్యనారాయణ గడియారం, వేయింగ్ మెషీన్‌లను బహూకరించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ డీఈ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై దాతలను శాలువాలతో సత్కరించి ప్రశంసించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కాళ్ల బాబు, సీహెచ్ భాస్కరరాజు, అబ్బాస్, కొమ్ము శ్రీను, రెడ్డి రాజు, తిరుశూల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాల్లో ఉపాధి గ్రామ సభలు



పడమర ఖండ్రిక గ్రామసభలో ఉపాధి పనులను వివరిస్తున్న సిబ్బంది

**కపిలేశ్వరపురం:** మండలంలోని వాకతిప్ప, పడమర ఖండ్రిక గ్రామాల్లో శనివారం జాతీయ ఉపాధిహామీ పథకం గ్రామ సభలు నిర్వహించారు. ఈనెల 21న కపిలేశ్వరపురంలో మండల స్థాయి సామాజిక తనిఖీ వేదిక నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామసభలను నిర్వహిస్తున్నారు. సర్పంచ్‌లు కొరిపెల్ల వెంకటనాగ స్రవంతి, తిరునాతి ఆదిలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభల్లో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి పనుల గురించి చర్చించారు. ఎస్ఆర్‌పీ ఇ.కనకరావు పర్యవేక్షణలో డీఆర్‌పీలు సువర్ణరాజు, ఎస్.గోపిలు సామాజిక తనిఖీలోని ప్రధాన అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పెద్దిరెడ్డి శేషారత్నం, ఎన్ఆర్‌ఈజీఎస్ జేఈ పి.రజిత్‌సింగ్, టెక్నికల్ అసిస్టెంట్ జె.లోవరాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు సునీత వీరమణి, తణుకు గణేష్, ఉపాధి మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

### 18న మండల ఐక్య క్రిస్మస్

**రాయవరం:** ఈ నెల 18న మండలంలోని చెల్లూరులో మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ నిర్వహించనున్నారు. రాయవరం మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ నిమిత్తం మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు జె.సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఐక్య క్రిస్మస్‌ను విజయవంతం చేయాలని సాల్మన్‌రాజు పిలుపునిచ్చారు. ఐక్య క్రిస్మస్‌కు కోనసీమ జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు బిషప్ డాక్టర్ డానియేల్‌పాల్ హాజరవుతారని ఆయన తెలిపారు.

# దమ్ము ట్రాక్టర్లతో రోడ్లు ధ్వంసం

- నిబంధనలు పాటించని ట్రాక్టర్ల యజమానులు
- పట్టించుకోని అధికారులు



చేదువాడ, రామచంద్రపురం రోడ్డుపై యథేచ్ఛగా ప్రయాణిస్తున్న దమ్ముచక్రాల ట్రాక్టర్



దమ్ముచక్రాల ట్రాక్టర్ పయనించడంతో ధ్వంసమైన ఆర్యావటం, మొగలిపాలెం రహదారి

**కాజులూరు:** నియోజకవర్గంలో అసలే అంతంత మాత్రంగా ఉన్న గ్రామీణ రహదారులు దమ్ము చక్రాల ట్రాక్టర్లు రాకపోకలతో ధ్వంసమవుతున్నాయి. ఏటా ఖరీఫ్, రబీల్లో పంట దమ్ముల సమయాల్లో ట్రాక్టర్ యజమానులు దమ్ము చక్రాలతో రోడ్లపై యథేచ్ఛగా పయనిస్తున్నారు. అయినప్పటికీ రహదారులకు సంబంధించిన ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులుకానీ, పోలీసు విభాగం కాని వాటిపై చర్యలు చేపట్టడం లేదు. గ్రామీణ రహదారుల్లో దమ్ము చక్రాల ట్రాక్టర్లు నిరోధించడంలో స్థానిక అధికారులు సైతం విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గ గ్రామాల్లో ఖరీఫ్ మాసూళ్లు పూర్తి కావడంతో రబీ పనులు ప్రారంభించిన రైతులు పొలాల్లో పంటదమ్ములు చురుగ్గా నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని కాజులూరు, కె.గంగవరం, రామచంద్రపురం మండల గ్రామాల్లో సుమారు 600 ట్రాక్టర్లు ఉన్నాయి. దమ్ముచేసే సమయంలో ఈ ట్రాక్టర్లకు ఇనుప చక్రాలను బిగించి పొలాల్లో దమ్ము చేస్తుంటారు. ఈ క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు ఒక పొలం నుంచి మరో పొలానికి వెళ్లేందుకు ఇనుప చక్రాలతోనే ట్రాక్టర్లుతో యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతుండటంతో రూ.లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, తారురోడ్లు ధ్వంసమవుతున్నాయి. ఫలితంగా రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది. ఇనుప చక్రాల దెబ్బకు రోడ్లు పగుళ్లు తీసి రాళ్లు పైకి లేచిపోవడంతో రహదారులు అధ్వానంగా తయారవుతున్నాయి. నియోజకవర్గంలో కాకినాడ–కోటిపల్లి, యానం–ద్వారపూడి, కాజులూరు–రామచంద్రపురం, గొల్లపాలెం–యానం రహదారులతో పాటు పలు గ్రామీణ రహదారులు దమ్ము చక్రాల తాకిడికి గుర్రై పాడై పోతున్నాయి. దమ్ము చక్రాలతో రోడ్లపై ప్రయాణించేటప్పుడు బెల్టు ఏర్పాటు చేసుకోవాలని ఉన్నతాధికారులు చూచిస్తున్నా ట్రాక్టర్ యజమానులు లక్ష్య పెట్టడం లేదు. వీటిపై స్థానికులు ఫిర్యాదు చేసినా ట్రాక్టర్ యజమానుల్లో గ్రామ సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు నాయకులు, గ్రామ పెద్దలు ఎక్కువగా ఉండడంతో వారిపై చర్యలు తీసుకునేందుకు, నోటీసులు ఇచ్చేందుకు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు సాహసించలేకపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి దమ్ముచక్రాల ట్రాక్టర్ల భారీ నుంచి గ్రామీణ రహదారులను కాపాడలని ప్రజలు కోరుతున్నారు.

#### ఇనుప బెల్టులు ఏర్పాటు చేసుకోవాలి



ట్రాక్టరు యజమానులు దమ్ము చేసేందుకై ఒక పొలం నుంచి మరో పొలం వెళ్లేందుకు టైరు చక్రాలు మార్చుకుని వెళ్లాలి. తప్పనిసరి పరిస్థితుల్లో దమ్ము చక్రాలకు ఇనుప బెల్టులను ఏర్పాటు చేసుకోవాలి. ఈ విషయంపై అధికారులు ట్రాక్టర్ యజమానులకు అవగాహన కల్పించాలి.

– పెంకే సత్యనారాయణ, కాజులూరు

#### రహదారుల ధ్వంసం



గ్రామాలలో ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తూ రహదారులను నిర్మిస్తోంది. అయితే వాటిపై దమ్ముచక్రాల ట్రాక్టర్లు ప్రయాణించడం వల్ల త్వరితగతిన శిథిలావస్థకు చేరుకుని అధ్వానంగా తయారవుతున్నాయి. అధికారులు పంటదమ్ములు పూర్తయ్యే వరకూ రహదారులపై నిఘా ఉంచాలి.

– మాత నూకరావు, దుగ్గుదుర్రు

#### ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం



దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు బెల్టు ఏర్పాటు చేసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా రహదారులపై దమ్ముచక్రాలతో ట్రాక్టర్లు పయనించడం తమ దృష్టికి వస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– ఎం.మోహన్‌కుమార్, ఎస్సై, గొల్లపాలెం

### లోక్ అదాలత్‌లో 125 కేసుల పరిష్కారం



అడిషనల్ జిల్లా, సెషన్స్ కోర్టుల ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్

**రామచంద్రపురం:** పట్టణంలోని అడిషనల్ జిల్లా, సెషన్స్ కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 125 కేసులు పరిష్కారమయ్యాయి. అడిషనల్ జిల్లా, సెషన్స్ కోర్టు జడ్జి ఎం.హరినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ లోక్‌అదాలత్‌లో 29 సివిల్, 66 క్రిమినల్, 25 ఎక్సైజ్, 6 ప్రీ లిటిగేషన్‌లకు సంబంధించి మొత్తం రూ.1,90,68,256లు విలువైన 125 కేసులు పరిష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.శారద, అడిషనల్ జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్, లోక్ అదాలత్ సభ్యులు జె.నాగేశ్వరరావు, ఎం.సత్తిరాజు, బి.సురేష్‌కుమార్, ఎస్‌బీఎస్ కుమారస్వామి, న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

### రేపు మండపేట మండల పరిషత్ బడ్జెట్ సమావేశం

**మండపేట:** మండల పరిషత్ బడ్జెట్ సమావేశం ఈ నెల 16వ తేదీ ఉదయం 10:30 గంటలకు ప్రారంభం అవుతుంది. ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు హాజరు కావాలని ఎంపీడీవో కె. సత్యనారాయణమూర్తి శనివారం కోరారు.

# ప్రశాంతంగా సాగు నీటి సంఘాల ఎన్నికలు

**కాజులూరు:** మండల గ్రామాల్లో శనివారం జరిగిన నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు మండల తహసీల్దార్ ఎల్.శివకుమార్ తెలిపారు. మండలంలో ఎనిమిది సంఘాలకు గానూ పలుచోట్ల సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా జరగ్గా పలు చోట్ల చెయ్యి ఎత్తే విధానం ద్వారా రైతులు సభ్యులను ఎన్నుకున్నారన్నారు. కాగా ఎనిమిది సంఘాల్లోనూ సభ్యులందరూ ఐక్యతతో వ్యవహరించి అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. గొల్లపాలెం నీటిసంఘం అధ్యక్షుడిగా సలాది శ్రీనివాసరావు, కోలంక దాట్ల విజయగోపాలరాజు, పల్లిపాలెం రాయుడు వెంకటరమణ, దుగ్గుదుర్రు కృష్ణచైతన్య, శలపాక తాడి మాచారెడ్డి, కాజులూరు యాళ్ల సత్యనారాయణ, మంజేరు గీసాల వీరవెంకటసత్యనారాయణ, పెనుమళ్ళ పేపకాయల నారాయణరావు ఎన్నికయ్యారన్నారు. ఎన్నికల అధికారులుగా ఎంపీడీఓ జె.రాంబాబు, ఏఓ వి.అశోక్, పంచాయతీరాజ్ జేఈ శంకర్ వ్యవహరించారన్నారు.

**కె.గంగవరంలో..**

**కె.గంగవరం:** మండల వ్యాప్తంగా శనివారం నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగాయి. మండలంలోని కూళ్ల, పామర్రు, యర్రపోతవరం, కోట, దంగేరు, కె.గంగవరం నీటి సంఘాలు ఉన్నాయి. శనివారం ఉదయం 8 గంటలను ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల వద్ద ఎన్నిక నిర్వహించారు. ఆరు నీటి సంఘాలకు చెందిన రైతులు ఏకాభిప్రాయానికి రావడంతో ఎన్నిక జరగకుండానే సంఘాన్ని ఎంపిక చేశారు. కోట సాగునీటి సంఘానికి ములకల విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా గోదావరి నాగేశ్వరరావు, యర్రపోతవరం సాగునీటి సంఘం అధ్యక్షుడిగా నిడదవోలు వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు చౌదరి, ఉపాధ్యక్షుడిగా నీల రాజరాజేశ్వరి, కూళ్ల సంఘం అధ్యక్షుడిగా ఎనుమల గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా చిట్టూరి వెంకట సుబ్రహ్మణ్యం, కె.గంగవరం సంఘం అధ్యక్షుడిగా తాడాల లోవరాజు, ఉపాధ్యక్షుడిగా నేమాని రామకృష్ణ శ్రీనివాస చౌదరి, పామర్రు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఆచంట శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా టేకిమూడి సత్యనారాయణ, దంగేరు సంఘం అధ్యక్షుడిగా గోపు సతీష్, ఉపాధ్యక్షుడిగా ఓబులనేని శ్రీనివాస్‌లను రైతులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎంపికైన సంఘ సభ్యులను ఆయా గ్రామాలకు చెందిన రైతులు పూలదండలతో సన్మానించి అభినందించారు. ఎన్నికలో ఎటువంటి సంఘటనలు జరగకుండా ఎస్సై జానీ బాషా వారి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన కూళ్ల సాగు నీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు, ఇతర సభ్యులు

**రామచంద్రపురం మండలంలో**

**రామచంద్రపురం రూరల్:** మండలంలోని వెలంపాలెం, వేగాయమ్మపేట, తోటపేట, వెల్ల, రామచంద్రపురం నీటి వినియోగదారుల సంఘాలకు శనివారం నిర్వహించిన ఎన్నికల్లో ఆయా నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులు ఏకగ్రీవంగా ఎంపికైనట్లు రామచంద్రపురం తహసీల్దార్ ఎం.సావిత్రి విలేకరులకు తెలిపారు. వెలంపాలెం సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా వల్లూరి సురేష్ బాబు, గాదె సురేష్, వేగాయమ్మపేట సంఘానికి గారపాటి సూర్య సత్యనారాయణ, బొండా గంగాధరరావు, తోటపేట సంఘానికి వనుమురెడ్డి ఆంజనేయులు, పిచ్చుక వీర్రాజు, వెల్ల సంఘానికి చిగురుపాటి సాయిరాం, కొమ్మిరెడ్డి రామారావు, రామచంద్రపురం సంఘానికి బిక్కిన జగన్నాథరావు, పంపన శ్రీనివాసరావులు ఎన్నికయ్యారన్నారు. ఈ మేరకు వారికి తహసీల్దార సావిత్రి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.



పల్లిపాలెం సాగునీటి సంఘానికి ఎన్నికైన కార్యవర్గ సభ్యులు



మండపేట మండలం ఏడిద నీటి సంఘ పాలకవర్గం

**రాయవరం మండలంలో..**

**రాయవరం:** మండలంలోని పసలపూడి, చెల్లూరు, కూర్మాపురం సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిసినట్టు తహసీల్దారు ఐపీ శెట్టి తెలిపారు. పసలపూడి నీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, శాకా కోటేశ్వరరావు, చెల్లూరు నీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బలుసు వీరవెంకట సత్యనారాయణమూర్తి, రిమ్మలపూడి సత్యనారాయణ, కూర్మాపురం నీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా కొరిపెల్ల వెంకట సత్య శ్రీనివాసరావు, చుండ్రు గోవిందరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రతి నీటి సంఘం నుంచి తొలుతగా 12 మంది ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులను ఎన్నుకున్న అనంతరం వారు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు.



ఎన్నికైన నీటి వినియోగదారుల సంఘాలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ సావిత్రి



పసలపూడి నీటి సంఘాధ్యక్షుడిగా సత్యనారాయణరెడ్డికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న తహసీల్దారు ఐపీ శెట్టి

**మండపేట:** మండలం, మండపేట పట్టణంలోని నాలుగు సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం ఏకగ్రీవం అయినట్టు తహసీల్దార్ తేజేశ్వరరావు తెలిపారు. ఏడిద నీటిసంఘం అధ్యక్షునిగా గ్రామానికి చెందిన కొలుపోటి సత్యనారాయణ (బాబు), ఉపాధ్యక్షునిగా తాపేశ్వరానికి చెందిన ముత్యాల పట్టాభి రామయ్య చౌదరి ఎన్నికయ్యారు. పాలతోడు నీటిసంఘం అధ్యక్షునిగా వెలగతోడుకు చెందిన బొబ్బిలి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా ఇప్పనపాడుకు చెందిన యరమాటి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. అలాగే కేశవరం పెద్దచెరువు నీటిచెరువు సంఘాధ్యక్షునిగా గ్రామానికి చెందిన అనదాసు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షునిగా పురంశెట్టి శ్రీనివాసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా పట్టణ నీటి సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా పసల శ్రీనివాసరావు, ముత్యాల సత్యనారాయణ ఎన్నికయ్యారు.

**కపిలేశ్వరపురం:** మండలంలో తహసీల్దార్ చిన్నారావు పర్యవేక్షణలో శనివారం నిర్వహించిన నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. అంగర నీటి సంఘం అధ్యక్షుడిగా కొమ్మిశెట్టి సూరిబాబు, ఉపాధ్యక్షుడిగా చోడే గోవిందరాజు, కాలేరు నీటిసంఘం అధ్యక్షుడిగా గుణ్ణం సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షుడిగా గుత్తుల పుత్రయ్య, వల్లూరు నీటి సంఘం అధ్యక్షుడిగా కాకర్ల శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షుడిగా సలుమూరి సింహాచలం, మాచర అధ్యక్షుడిగా కొరపాటి జానకి రామయ్య, ఉపాధ్యక్షుడిగా సలాది సీతారాంబాబు, తాతపూడి నీటిసంఘం అధ్యక్షుడిగా మేకా శివప్రసాద్, ఉపాధ్యక్షుడిగా చుండ్రు భవ్య ఎన్నికయ్యారు. ఒక్కో సంఘానికి పది మంది చొప్పున సభ్యులను ఎన్నుకున్నారు.

## మాలల మహాగర్జన విజయవంతం చేయండి

**కాజులూరు:** గుంటూరులో ఆదివారం జరుగనున్న మాల మహాగర్జనను మాలలు, మాల ఉపకులాల సభ్యులందరూ విజయవంతం చేయాలని అఖిల భారత మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మాత సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం జేఏసీ నాయకులు మండల గ్రామాల్లో పర్యటించి కార్యక్రమానికి హాజరు కావలసిందిగా ప్రజలను ఆహ్వానించారు. గొల్లపాలెం ధనమహాలక్ష్మీపేట అంబేడ్కర్ మందిరం వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ అన్నదమ్ముల వలే ఐకమత్యంగా ఉన్న ఎస్సీలను కొందరు నాయకులు రాజకీయలబ్ధి కోసం విడదీయాలని కుట్రపన్నుతున్నారన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా కోర్టులను అడ్డం పెట్టుకుని ఎస్సీ వర్గీకరణ చేయాలని చూస్తున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా గుంటూరులో జరుగుతున్న మహాధర్నాకు సభ్యులందరూ తరలివచ్చి మాలల సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పత్తిపాటి బులిరాజు, కార్యవర్గ సభ్యులు ఉబా చిన్ని, మాత అప్పారావు, దుబాయ్ శ్రీను, మాత నాగరాజు, ముద్రే నాగార్జున, బండి అబ్బు, నిమ్మితి విజయ్, పోలినాటి సూర్యచంద్రం తదితరులు పాల్గొన్నారు.



గొల్లపాలెంలో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేసున్న జేఏసీ నాయకులు

## ప్రభుత్వాలు మారితే.. దేవుడి పరిస్థితిలోనూ మార్పు వస్తుందా..?

**రామచంద్రపురం రూరల్:** ప్రభుత్వాలు మారితే.. దేవుడి పరిస్థితిలోనూ మార్పు వస్తుందా..? అంటే అవుననే అంటున్నారు భక్తులు. వివరాల్లోకి వెళితే గడచిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, అప్పటి ఈఓ పి.తారకేశ్వరరావుల నేతృత్వంలో ప్రతి కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించేవారు. స్వామివారిని అమ్మవారికి అలంకారాలు అదరగొట్టేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇదే నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న వాసంశెట్టి సుభాష్ ఆలయంపై పెత్తనం స్థానిక కూటమి నాయకులకు అప్పగించడంతో ఆలయంలో పూర్వ వైభవం కొరవడిందని భక్తులు భావిస్తున్నారు. గత ఏడాది అమ్మవారి శరన్నవరాత్ర ఉత్సవాలకు ఈ ఏడాది ఉత్సవాలకు పోల్చుకుని భక్తులు పెదవి విరవడంపై చర్చ జరుగుతుంది. దీనికి తోడు శనివారం భీమేశ్వరస్వామి జన్మ నక్షత్ర పూజల్లోనూ ఆ తేడా కొట్టొచ్చినట్టు కనిపిస్తుందని చెప్పుకుంటున్నారు. పర్వదినాల్లో కూడా స్వామి, అమ్మవార్లకు నిండుగా అలంకరణలు కూడా చేయడం లేదని భావిస్తున్నారు.



జన్మనక్షత్ర పూజల సందర్భంగా గతేడాది అలంకరణ



జన్మనక్షత్ర పూజల సందర్భంగా ఈ ఏడాది అలంకరణ

# హిమసోయగం



చెట్టు ఆకులపై కమ్ముకున్న పొగమంచు

**కె.గంగవరం:** గత నాలుగు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా తెల్లవారుజాము నుంచి మంచు కురుస్తోంది. మంచుతో వాతావరణం ఆహ్లాదకరంగా ఉండడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లేవారు. ప్రకృతి ప్రేమికులు పచ్చని వరి చేలపై, రహదారిపై కమ్మేసిన మంచును చూసి ఆనందం వ్యక్తం చేస్తూ పొగ మంచు సోయగాలను తమ సెల్ ఫోన్‌లో బంధిస్తున్నారు. పామర్రు–కురకాళ్లపల్లి రహదారిలో రోడ్డుపక్కనే చెట్టు ఆకులకు రక్షణ కలిపిస్తున్నట్లు పొగ మంచు కప్పేసి ఆహుతులను ఆకట్టుకుంది. పొగమంచు సోయగం చూడడానికి వినూత్నంగా ఉండడంతో ప్రతి ఒక్కరూ చూసి ఫొటోలు తీసుకున్నారు.

### విద్యుత్ వనరులను రక్షించుకోవాలి



ఈఈ రత్నాలరావు

**రామచంద్రపురం రూరల్:** విద్యుత్ వనరులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు అన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహిస్తున్న జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాలు విజయవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. ఇంధన వనరులపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచడానికి ఈ నెల 16 న కపిలేశ్వరపురంలో వ్యాసరచన పోటీలు, 17న రామచంద్రపురం మోడరన్ కళాశాలలో డ్రాయింగ్ పోటీలు, 18న ద్రాక్షారామ, రామచంద్రపురం, కె.గంగవరం గ్రామాల్లో విద్యుత్ పొదుపు పై అవగాహన కల్పించేలా బుర్రకథ కార్యక్రమాలు, 19న రామచంద్రపురం వీఎస్ఎం కళాశాలలో వక్తృత్వ పోటీలు, 20న రామచంద్రపురం డివిజన్ కార్యాలయం వద్ద బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## వైద్యానికి గత ప్రభుత్వం పెద్దపీట



వంద పడకల ఆసుపత్రి పనులను పరిశీలిస్తున్న రాజ్యసభ సభ్యుడు బోస్, ఎమ్మెల్యే జోగేశ్వరరావు

మాజీమంత్రి, రాజ్యసభ సభ్యుడు బోస్

**మండపేట:** రాష్ట్రంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేసిందని మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరై నిర్మాణ దశలో ఉన్న పట్టణంలోని వంద పడకల ఆసుపత్రిని ఆయన స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, అధికారులతో కలిసి శనివారం సందర్శించారు. మెయిన్ రోడ్డులోని వీవీఎస్ఎస్ చౌదరి పెట్రోలు బంకు ఎదురుగా నిర్మితమవుతున్న ఆసుపత్రి పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు బోస్ మాట్లాడుతూ మండపేట, చుట్టుపక్కల గ్రామాల ప్రజల సౌలభ్యం కోసం ఈ పట్టణానికి వంద పడకల ఆసుపత్రిని జగన్ మజూరు చేశారన్నారు. పనులన్నింటినీ ఆయన ఎమ్మెల్యే వేగుళ్లతో కలిసి పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నేత వేగుళ్ళ పట్టాభి రామయ్య చౌదరి, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు పోతంశెట్టి వరప్రసాద్, మందపల్లి రవికుమార్, టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ వుంగరాల రాంబాబు, పెంకే గంగాధర్, వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారులు పాల్గొన్నారు.